7

సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



మోతెగడ్డ ముస్తాబు

పవిత్ర గోదావరి నది మధ్య మోతెగడ్డలోని భద్రకాళి సమేత వీరభద్రుని కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. 8లో



మళ్లీ కళకళలాడేలా..!

అభయారణ్యాల్లో జింకలు, దుప్పుల వంటి వన్యప్రాణుల సంతతి పెంచాలని అటవీశాఖ నిర్ణయించింది. 10లో

గరిష్టం/కనిష్టం 35°/20°

వాతావరణం

జిల్లాలో శనివారం తెల్లవారుజామున చలి ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం కొంత ఎండ తీవ్రత ఉండవచ్చు

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం పూజలు నిర్వహించారు. ముందుగా మేళ తాళాలతో అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు.

నేడు రుద్రహోమం

ఆలయంలో శివరాత్రి సందర్భంగా శనివారం రుద్రహోమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రజనీకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు, మేనేజర్ పూర్ణిమ (మధ్యలో)

కొత్తగూడెంటౌన్: జాతీయ హాకీ పోటీలకు కొత్తగూడేనికి చెందిన వి.వర్షిత, రిషిత ఎంపికయ్యారు. అలాగే, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టుకు కొత్తగూడేనికి చెందిన సీనియర్ హాకీ క్రీడాకారిణి పూర్ణిమ మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఈ విషయాన్ని హాకీ జట్టు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు ప్రేమ్‌కుమార్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, మేనేజర్‌ను ప్రేమ్, చైర్మన్ పల్లపోతు వాసుతో పాటు ఇమాం, లగడపాటి రమేష్, సలీంఖాన్, రాజ్‌కుమార్, కృష్ణవేణి, కవిత, మంజుల, రవికుమార్, రాజ్‌కుమార్ అభినందించారు.

సీఎం దృష్టికి తీసుకెళ్లాం..

ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

ఇల్లెందురూరల్: కొమరారం, బోడు కేంద్రంగా నూతన మండలాలు, ఇల్లెందు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లామని, ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని, త్వరలోనే ప్రజల ఆకాంక్ష నెరవేరుతుందని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ తెలిపారు. కొమరారం నూతన మండలం ఏర్పాటు చేయాలని కోరుతూ కొమరారం గ్రామంలో ప్రజాపంథా ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను శుక్రవారం ఆమె సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇదే విషయమై పలుమార్లు అసెంబ్లీలో కూడా ప్రస్తావించానని, ప్రభుత్వం సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటుందనే విశ్వాసం తనకు ఉందని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, రైతుబంధు సమితి రాష్ట్ర సలహాదారు పులిగళ్ళ మాధవరావు, వైస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి రేణుక, యలమద్ది రవి, గాజీ, ప్రజపంథా రాష్ట్ర నాయకులు రాయల చంద్రశేఖర్, ఎంపీటీసీ ఆజ్మీర బిచ్చా, సర్పంచ్ నాళి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ కిలో రూ. 160!



మార్కెట్‌లో విక్రయిస్తున్న చికెన్

చుంచుపల్లి: కొద్ది రోజులుగా చికెన్ ధరలు దిగొస్తున్నాయి. ఇటీవల కాలంలో కిలో ధర రూ.100 పైగా తగ్గడం ఇదే ప్రథమం. రెండు నెలల క్రితం కిలో చికెన్ రూ. 280 వరకు విక్రయించారు. జనవరి నుంచి మొన్నటి వరకు కిలో రూ.240 చొప్పున ధర పలికింది. ప్రస్తుతం చికెన్ స్కిన్ రూ.160, స్కిన్‌లెస్ రూ. 180కి పడిపోవడం గమనార్హం. కాగా వేసవి ఆరంభంతో చికెన్ ధరలు తగ్గడం సాధారణమేనని వ్యాపారులు చెపుతున్నారు. మొన్నటి వరకు పెళ్లిళ్లు అధికంగా ఉండటం చికెన్ వ్యాపారులు బాగా కలిసొచ్చింది.

పారదర్శకమేనా..!

- ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణలో అవినీతి ఆరోపణలు
- మొదటి విడతలో 1,001 దరఖాస్తుల తిరస్కరణ
- రీ సర్వేలోనూ రాజకీయ జోక్యం, పైరవీలు..
- ఈసారైనా న్యాయం చేయాలని కోరుతున్న అర్జీదారులు



కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మున్సిపాలిటీలో ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ రీ సర్వే ప్రక్రియ పారదర్శకంగా జరగడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ జోక్యం, పైరవీలు, సర్వే సిబ్బంది పొరబాట్లు రెండో విడత క్రమబద్ధీకరణకు అవరోధంగా మారుతున్నాయి. రెండో విడతలో పట్టాల కోసం దాదాపు 1,531 మంది దరఖాస్తు చేసుకోగా, ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించిన సిబ్బంది 1,001 దరఖాస్తులను తిరస్కరించారు. సర్వే బృందాల అవగాహనా రాహిత్యం, కొన్ని స్థలాల్లో ఇళ్లు లేకపోవడం, కొందరు దరఖాస్తుదారులు అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో తిరస్కరించినట్లు తెలుస్తోంది. బాధితులు ప్రజాప్రతినిధులను, ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించగా రెవెన్యూ అధికారులు రీ సర్వేకు అవకాశం కల్పించారు. గత వారం వరకు 80 శాతం వరకు రీ సర్వే పూర్తయింది. అయితే రీ సర్వేలోనూ సర్వే టీమ్‌లు అదే తప్పులు చేస్తున్నాయనే, పైరవీలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. గతంలో మాదిరిగానే నామమాత్రంగా, ఇళ్లలోకి వెళ్లి పూర్తి వివరాలు తెలుసుకోకుండా, ఖాళీ స్థలాలు ఉన్న వాటిని, అందుబాటులో లేని వారికి సంబంధించి, డాక్యుమెంట్‌లు పూర్తి స్థాయిలో లేకపోయినా రిజెక్టు చేస్తున్నారని దరఖాస్తుదారులు పేర్కొంటున్నారు. పట్టణంలోని 36 వార్డుల్లో సర్వే పక్కాగా నిర్వహించి, అర్హులందరికీ అప్రూవల్ ఇవ్వాలని పట్టణవాసులు కోరుతున్నారు.



పట్టణంలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

రీ సర్వే 80 శాతం పూర్తి..



కొత్తగూడెం పట్టణంలో 1,531 మంది రెండో విడతలో పట్టాల కోసం దరఖాస్తులు చేసుకోగా, 530 వరకు పట్టాలు మంజూరు చేశాం. మిగిలినవి తిరస్కరించగా, గత నెల నుంచి వాటిపై రీ సర్వే జరుగుతోంది. ఇప్పటివరకు 80 శాతం సర్వే పూర్తయింది. మిగిలిన ప్రక్రియ పూర్తి చేయిస్తాం. అర్హులందరికీ పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

–రామకృష్ణ, కొత్తగూడెం తహసీల్దార్

ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్ల ఒత్తిళ్లు..

కొత్తగూడెం పట్టణ పరిధిలోని ఇళ్లకు యాజమాన్య హక్కు కల్పించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2008 సంవత్సరంలో 373 జీఓ జారీ చేశారు. దీంతో 11 వేల మంది క్రమబద్ధీకరణ పట్టాల కోసం దరఖాస్తు చేసుకోగా, 4,600 మందికి పట్టాలు మంజూరు చేశారు. మిగిలిన 6,400 మందికి వివిధ కారణాలతో పట్టాలు రాలేదు. వారి కోసం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు చొరవతో ప్రభుత్వం 76 జీఓ విడుదల చేసింది. దీంతో మొదటి విడతగా 6,146 మంది పట్టాలకు దరఖాస్తు చేసుకోగా 3,500 మందికి గతేడాది పట్టాలు మంజూరయ్యాయి. ఇంకా మిగిలిన వారి కోసం గత జూలైలో దరఖాస్తులకు చివరి అవకాశం ఇవ్వగా 1,531 మంది దరఖాస్తు చేసుకున్నారు. 2022 నవంబర్‌లో సర్వే నిర్వహించి కేవలం 530 మందికి మాత్రమే పట్టాలు మంజూరు చేసి మిగిలిన దరఖాస్తులను తిరస్కరించారు. అయితే పట్టాల ప్రక్రియపై మొదటి నుంచీ అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. తిరస్కరించిన దరఖాస్తులను రీ సర్వే చేసేందుకు ఒక్కో బృందంలో నలుగురు అధికారుల చొప్పున దాదాపు 15 బృందాలు వార్డుల్లో తిరుగుతున్నాయి. సర్వే ప్రక్రియ దాదాపు 25శాతం మిగిలి ఉండగా, ప్రధానంగా రాజకీయ జోక్యం పెరిగింది. దీంతో తమ దరఖాస్తులను మళ్లీ తిరస్కరిస్తారేమోననే ఆందోళనతో అర్జీదారులు ప్రజాప్రతినిధులు, వార్డు కౌన్సిలర్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా వారు తమకు నచ్చినవారికి అప్రూవల్ చేయిస్తూ, మిగిలిన వారివి రిజెక్టు చేయిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తమకు సమాచారం ఇచ్చాకే వార్డుల్లో సర్వేకు రావాలని ప్రజాప్రతినిధులు హుకుం జారీ చేయడంతో ప్రక్రియ ఆలస్యమవుతోంది. గతంలో సమాచారం ఇవ్వకుండా వచ్చిన సర్వే బృందాలతో ఆయా వార్డుల కౌన్సిలర్లు గొడవకు దిగిన సంఘటనలు కూడా ఉన్నాయి. దీంతో అధికారులు కూడా ఒకింత ఆందోళన చెందుతున్నారు. నిబంధనల ప్రకారం 2014, జూన్ 2వ తేదీకి ముందు ఇళ్లు ఉండి, ఇంటిపన్ను కలిగి ఉన్న వారికి సర్వే జరిపి క్రమబద్ధీకరణ పట్టాలను మంజూరు చేయాలి. కాగా స్థలంలో చిన్న గది మాత్రమే ఉందని, ఇక్కడ నివాసం ఉండటం లేదనే కారణాలతో దరఖాస్తులను తిరస్కరించడం సరికాదని దరఖాస్తుదారులు చెబుతున్నారు.

వేగవంతం చేయాలి

కలెక్టర్ అనుదీప్



మాట్లాడుతున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అనుదీప్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు, మనఊరు– మనబడి కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనుల ప్రగతిని డీఆర్‌డీఓ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.39.08 కోట్ల వ్యయంతో 697 పనులు చేపట్టామని, ఇప్పటివరకు రూ.6.57 కోట్ల విలువైన 148 పనులు ప్రారంభమయ్యాయని వివరించారు. రూ.88 లక్షల విలువైన 22 పనులు పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన అన్ని పనులను మార్చి 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ సబ్ డివిజన్ వారీగా జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులు, ఎఫ్‌టీఓల జనరేషన్‌పై ప్రతీరోజు నివేదికలు అందజేయాలని స్పష్టం చేశారు. నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్లకు ఇరువైపులా మట్టితో నింపాలని, రోడ్డుకు సమానంగా లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుపై మండలాల వారీగా నివేదికలు అందజేయాలని డీఆర్‌డీఓకు సూచించారు.

నిధులు వెనక్కు తీసుకోవాలి

డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరైనా ఇంకా ప్రారంభించని పనులను రద్దుచేసి నిధులు వెనక్కి తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. శుక్రవారం ఐడీఓసీలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌సీఏ నిధులతో చేపట్టిన పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ తీసుకోవాలని, ఎందుకు జాప్యం చేస్తున్నారని గిరిజన ఇంజనీరింగ్ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సక్రమంగా చేయని కాంట్రాక్టర్లకు పనులు ఇవ్వొద్దన్నారు. ఇల్లెందు, మణుగూరు, చర్ల మండలాల్లో గ్రంథాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా పనులు చేపట్టకపోడంతో సంబంధిత డీఈకి షోకాజ్ నోటీసు జారీచేయాలని ఆదేశించారు. డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టిన పనుల్లో జాప్యానికి భద్రాచలం ఈఈ, డీఈలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. సీఎస్‌ఆర్ నిధులతో జగన్నాథపురంలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యకరమాల్లో డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, ఇతర అధికారులు భీమ్లా, మరియన్న, మంగ్యా, రమాకాంత్, శ్రీనివాసరావు , రామకృష్ణ, సత్యనారాయణ, వేణుగోపాల్, సైదులురెడ్డి, రాజేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

మహాశివరాత్రి శుభాకాంక్షలు..

జిల్లా ప్రజలకు కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో మహాశివరాత్రి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పరమశివుని ఆశీస్సులతో జిల్లా అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని కోరారు. ప్రజలు సుఖ, శాంతులతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

హైకోర్టును ఆశ్రయించిన ఇల్లెందు కౌన్సిలర్లు

అసమ్మతి నోటీసుపై అధికారులు స్పందించడం లేదని ఫిర్యాదు



క్యాంపులో సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న అసమ్మతి కౌన్సిలర్లు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై అవిశ్వాస తీర్మానం కోరుతూ కలెక్టర్‌కు ఈనెల 6వ తేదీన నోటీసు ఇచ్చిన కౌన్సిలర్లు తాజాగా హైకోర్టును ఆశ్రయించారు. అవిశ్వాస తీర్మానంపై అధికారులు స్పందించడం లేదని చెబుతూ కౌన్సిలర్ కొండపల్లి సరిత హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేయగా నంబర్ కేటాయించారు. ఈ కేసు ఈ నెల 21వ తేదీన బెంచ్ పైకి వచ్చే అవకాశముందని తెలుస్తోంది. కాగా, ఈనెల 6వ తేదీన అవిశ్వాస తీర్మానంపై నోటీసు ఇచ్చాక 12 మంది కౌన్సిలర్లు యానాంలో క్యాంపునకు వెళ్లగా.. ఎంత నచ్చచెప్పినా మెట్టు దిగడం లేదు. ఇంతలోనే 12వ తేదీన హైకోర్టు ఆశ్రయించినట్లు తెలుస్తుండగా, చర్చనీయాంశంగా మారింది. కాగా, తమ అసమ్మతి మున్సిపల్ చైర్మన్‌పైనే తప్ప పార్టీపై కాదని ఆది నుంచి చెబుతున్న కౌన్సిలర్లు శుక్రవారం తమ క్యాంపులో సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేయడం విశేషం.

భారజల ఉత్పత్తిలో అగ్రస్థానం

- మణుగూరు నుంచి అమెరికాకు ఎగుమతి
- హైదరాబాద్ ఎన్‌ఎఫ్‌సీ చైర్మన్ కోమల్ కపూర్



వేడుకలను ప్రారంభిస్తున్న ఎన్‌ఎఫ్‌సీ చైర్మన్ కోమల్ కపూర్

అశ్వాపురం: భారజలం ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారతదేశం అగ్రస్థానంలో ఉందని హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కోమల్‌కపూర్ పేర్కొన్నారు. అశ్వాపురంలోని మణుగూరు భారజల కర్మాగారం జీఎం కేవీ.థాలే అధ్యక్షతన గౌతమీనగర్ కాలనీలోని అణుశక్తి కేంద్రీయ విద్యాలయం ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన భారజల దినోత్సవాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన ప్రారంభించారు. ఈ ఏడాది మణుగూరు భారజల కర్మాగారానికి బోరాన్ ఉత్పత్తిలో అచీవ్‌మెంట్ అవార్డు రాగా, అవార్డును జీఎం కేవీ.థాలేకు అందజేశారు. ఈ సందర్భంగా కోమల్ కపూర్ మాట్లాడుతూ భారజలం ఉత్పత్తిలో మణుగూరు కర్మాగారానికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. భారజల కర్మాగారం జీఎం కేవీ.థాలే మాట్లాడుతూ మణుగూరు భారజల కర్మాగారం నుంచి అమెరికాకు భారజలం ఎగుమతి చేస్తున్నామని పేర్కొన్నారు. అణువిద్యుత్ తయారీతో పాటు ప్రస్తుతం కేన్సర్ నిరోధక మందుల్లో భారజలం ఉపయోగం పెరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈసీఎస్ విద్యార్థులు, కాలనీ మహిళలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో భారజల కర్మాగారం సీఏఓ కాంబ్లే, డీజీఎంలు పీజేవీ.సుధాకరన్, హరిప్రసాద్, జగ్గారావు, ఏఈసీఎస్ ప్రిన్సిపల్ రాజశేఖర్‌రావు, అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల పరిశీలన

బూర్గంపాడు: బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను శుక్రవారం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సులోచనారాణి పరిశీలించారు. విద్యార్థుల ప్రాక్టికల్స్‌ను, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు, విద్యార్థులకు సూచనలు చేశారు. ఆమె వెంట డీఈసీ మెంబర్ యూసుఫ్, కళాశాల ప్రిన్సిపాల్ చీన్యా తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధించాలి

ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి, పాయం తదితరులు

అశ్వాపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించారు. మల్లెలమడుగు గ్రామంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామచంద్రాపురం, మల్లెలమడుగు, మొండికుంట, సీతారాంపురం, కొమ్ముగూడెం, అమ్మగారిపల్లి, చింతిర్యాల గ్రామాల్లో మృతుల కుటుంబాలను, అనారోగ్యాల బారిన పడిన పలువురు బాధితులను పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేశారు. ఎవరూ అధైర్యపడవద్దని ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. సీతారాంపురం గ్రామంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన వీరన్న కుటుంబానికి పొంగులేటి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఖదిర్, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ కమటం నరేష్, మాజీ సర్పంచ్ పాడియం అనిల్, నాయకులు ముత్తినేని వాసు, ఓరుగంటి రమేష్, సత్యనారాయణరెడ్డి, ఆవుల రవి, రాగం మల్లయ్య, తెల్లం వీరభద్రం, కొండలరావు, బొబ్బాల నాగేశ్వరరావు, బెల్లి బాబూరావు, చిట్యాల సత్యం, దేవరప్రు శ్రీనివాస్, పర్వత నరేష్, నెహ్రూ, దేపంగి వెంకటరమణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త ఈఓకు కత్తి మీద సామే..



రామాలయం వ్యూ

- భద్రాద్రి ఉద్యోగుల్లో వర్గ విభేదాలు.. అధికారుల్లో నిర్లక్ష్యం
- లడ్డూలకు బూజు పట్టడంతో రాష్ట్రస్థాయిలో అభాసుపాలు
- భద్రాచలం రామాలయాన్ని చుట్టుముట్టిన వివాదాలు
- మరోవైపు సమీపిస్తున్న నవమి, పట్టాభిషేక మహోత్సవాలు
- ఈఓ రమాదేవిపై సమస్యలను చక్కదిద్దాల్సిన బాధ్యత..

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం నూతన ఈఓగా బాధ్యతలు స్వీకరించిన రమాదేవికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన రామాలయం పేరు ఇటీవల వరుస వివాదాలతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చల్లో నిలిచింది. ఆలయ ఉద్యోగుల నడుమ కొరవడిన సమన్వయం, గోశాల నిర్మాణం పూర్తి, ఏపీలోని రామయ్య భూముల రక్షణ తదితర సమస్యలను చక్కదిద్దడంతోపాటు వచ్చే నెలలో జరిగే శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేక మహోత్సవం విజయవంతం చేయాల్సిన బాధ్యత కొత్త ఈఓపై ఉంది.

రామయ్య భూముల రక్షణ..

శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి సుమారు 1,350 ఎకరాల భూమి ఉన్నట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందులో అత్యధికంగా 889 ఎకరాలు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పురుషోత్తపట్నం గ్రామంలోనే ఉంది. వీటిలో అత్యధిక భాగం ఆక్రమణలోనే కొనసాగుతోంది. వివాదం ముదిరి ఇరు రాష్ట్రాల అధికారులతో కమిటీలు ఏర్పాటు చేశారు. ఆక్రమణదారులకు నోటీసులను జారీ చేస్తున్నప్పటికీ రామయ్య భూముల్లో ఆక్రమణలు ఆగలేదు. హైదరాబాద్‌లో ల్యాండ్ ప్రొటెక్షన్ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసిన రమాదేవికి భూ సమస్యలు, పరిష్కారాలపై విశేష అనుభవం ఉంది. దీంతో ఆ భూముల వివాదాలను చక్కదిద్ది, భూముల రక్షణ ప్రయత్నాల్లో భాగంగానే దేవాదాయ శాఖ ప్రత్యేకంగా రమాదేవిని ఇక్కడ నియమించారనే ప్రచారం కూడా సాగింది. ఈ క్రమంలో భూముల రక్షణలో ఏ మేరకు సఫలీకృతమవుతారో చూడాల్సి ఉంది. గోశాల నిర్మాణం, రామాలయంలో అభివృద్ధి పనులు, దాతల సహకారం కోసం కూడా చొరవ చూపాల్సి ఉంది.

వచ్చే నెలలో ఉత్సవాలు..

ఇక భద్రాచలంలో మార్చి నెల 30,31వ తేదీల్లో శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేక మహోత్సవాలు జరగనున్నాయి. ఈ ఏడాది 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించాల్సి ఉంది. మార్చి 22 నుంచి తిరుకల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలకు సుమారు నెల రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఈ నెలలోనే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాల్సి ఉంది. కాగా ఉత్సవాల ప్రచారంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు నెలకొన్నాయి. రామయ్య పెండ్లి పత్రికల వద్ద నుంచి వాటిని గవర్నర్, సీఎం, మంత్రులకు అందించి ఆహ్వానాలు పలకాలి. పుష్కర పట్టాభిషేక మహోత్సవానికి ప్రత్యేక అతిథులను ఆహ్వానిస్తే తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంది. వీటన్నింటిని సమన్వయం చేసుకుంటూనే సామాన్య భక్తులకు ఎటువంటి వసతి ఇబ్బందులు తలెత్తకుండా నూతన ఈఓ ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి ఉంది.

సమస్యల పరిష్కారానికి కృషి..



దేవస్థానంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. అందరి సహాయ సహకారాలతో రామాలయ అభివృద్ధికి ప్రయత్నిస్తాను. వచ్చే నెలలో శ్రీరామనవమి, పట్టాభిషేక ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంతోపాటు సామాన్య భక్తులకు అన్ని వసతులు కల్పిస్తాం.

– ఎల్.రమాదేవి, ఈఓ, రామాలయం

కొరవడిన సమన్వయం

ఉద్యోగులు, సిబ్బంది నడుమ సమన్వయం కొరవడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. పూజల్లో, క్రతువుల్లో కీలక పాత్ర పోషించే వైదిక సిబ్బంది నడుమ వర్గపోరు ఇటీవల తారాస్థాయికి చేరుకుంది. ప్రస్తుతం ఉన్న వైదిక కమిటీలో రెండో ప్రధాన అర్చకుడికి స్థానం కల్పించకపోతే ఉత్సవాల బహిష్కరణకు సైతం సిద్ధమంటూ ఉన్నతాధికారులకు అల్టిమేటం జారీ చేశారు. ఒక వర్గం ఏకపక్షంగా వ్యవహరిస్తూ వైదిక క్రతువు సమాచారాలను సైతం తెలపటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరందరినీ సమన్వయ పరిచి, పాలన గాడిలో పెట్టాల్సి ఉంది.

పర్యవేక్షణా, సమన్వయ లోపం

భద్రాచల దివ్యక్షేత్రంలో అధికారుల పర్యవేక్షణా లోపం తొలి నుంచి సమస్యగా మారింది. ఈఓలు మారుతున్నా ఉద్యోగులను, వైదిక సిబ్బందిని ఏకతాటిపైకి తెచ్చి సమస్యలు పరిష్కరించటంలో, పర్యవేక్షించటంలో విఫలమవుతున్నారు. పర్యవేక్షణా లోపంతో అనేక వివాదాలు రామయ్యను చుట్టుముడుతున్నాయి. ఇటీవల ముక్కోటి ఉత్సవాల సందర్భంగా స్వామివారి ప్రసాదమైన లడ్డూలు బూజు పట్టడం ఉద్యోగులు, ఈఓ స్థాయి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. స్వయంగా భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జోక్యం చేసుకుని స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే ఈఓగా పనిచేస్తున్న శివాజీపై బదిలీ వేటు పడిందనే ప్రచారం సైతం జరిగింది.

క్లుప్తంగా

స్వర్ణకవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలో మూలమూర్తులు స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు, సాయంత్రం దర్బారు సేవలు జరిపారు.

రాముడిని దర్శించుకున్న పూరి జగన్నాథ్ కుటుంబం



ఆలయంలో పూరి జగన్నాథ్ సతీమణి, కుమార్తె

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారిని శుక్రవారం ప్రముఖ సినీ దర్శకుడు పూరి జగన్నాథ్ కుటుంబసభ్యులు దర్శించుకున్నారు. పూరి జగన్నాథ్ భార్య లావణ్య, కుమార్తె పవిత్ర అంతరాలయంలో మూలమూర్తులతో పాటు ఆలయ ప్రాంగణంలోని శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారు, శ్రీ అభయాంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

రెండు గుడారాలు దగ్ధం

గుండాల: గంగిరెద్దు ఆటలు ఆడిస్తున్న రెండు కుటుంబాలకు చెందిన గుడారాలు కాలిపోయిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన ఆవుదొడ్డి సతీష్, మోర్సా వెంకన్నలు గత కొంతకాలంగా సాయనపల్లి గ్రామంలో గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే గురువారం రాత్రి చలిమంట వేసుకోగా.. శుక్రవారం తెల్లవారు జామున చల్లార్చి పనికి వెళ్లారు. కానీ, కర్రలకు ఉన్న నిప్పు చల్లారక పోవడాన్ని గమనించకపోవడంతో కర్రలకు ఉన్న నిప్పు గాలికి ఎగిసి పడి గుడారాలు కాలిపోయాయి. దీంతో రూ. 50వేల నగదు, అరతులం బంగారం, 4 బస్తాల బియ్యం కాలిపోయాయని బాధితులు వాపోయారు. తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

22 నుంచి డీఎల్ఈడీ వార్షిక పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 22వ తేదీ నుంచి డీఎల్ఈడీ(డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) మొదటి సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ఎస్ఎస్.ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్లను వెబ్సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 78 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని, పరీక్ష కేంద్రం కోసం ప్రభుత్వ ఉన్నత పాఠశాల చుంచుపల్లి ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతుందని, అభ్యర్థులు గంట ముందుగా పరీక్ష సెంటర్కు చేరుకోవాలని, వివరాలకు 99890 27943 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

దమ్మపేట: పెట్రోల్ కావాలని వచ్చిన ఇద్దరు యువకులు షాపులో ఉన్న మహిళ మెడ నుంచి బంగారు గొలుసు లాక్కెల్లారు. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని అచ్యుతాపురం శివారులో చుంచు పార్వతి కూల్ డ్రింక్స్ షాపు నిర్వహిస్తోంది. శుక్రవారం సాయంత్రం బైక్పై వచ్చిన ఇద్దరు యువకులు పెట్రోల్ కావాలని అడగగా ఇచ్చింది. ఇంతలోనే వారు పార్వతి మెడలో బంగారు గొలుసు లాక్కుని పారిపోయారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలు వెల్లడించింది.

అన్నం ఫౌండేషన్లో సోలార్ వెలుగులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆశ్రమంలో తానా ఫౌండేషన్ బాధ్యులు రూ.7.50లక్షల విలువైన సోలార్ యూనిట్ సమకూర్చారు. విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని తెలుసుకుని తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా అధ్యక్షుడు లావు అంజయ్యచౌదరి, ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ వెంకటరమణ, తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబల్ ట్రస్ట్ ద్వారా యూనిట్ ఏర్పాటుచేయగా, శుక్రవారం తాళ్లూరి జయశేఖర్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు మల్లాది వాసు, దొడ్డపనేని సాంబశివరావు, రంగారావు, రామారావు, బండి నాగేశ్వరావు, అమరేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి మోతెగడ్డ ముస్తాబు..

కోరిన కోర్కెలు తీర్చే వీరభద్రస్వామి

- వీరభద్రుడి కల్యాణానికి సర్వం సిద్ధం
- ఇప్పటికే మొదలైన భక్తుల రాక
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సౌకర్యాల కల్పన



మోతెగడ్డ శివాలయం (ఇన్సెట్) మూలవిరాట్ వీరభద్రస్వామి

బూర్గంపాడు: గత గోదావరి పుష్కరాలతో రాష్ట్రవ్యాప్తంగా ఖ్యాతికెక్కిన మోతెగడ్డలోని భద్రకాళి సమేత వీరభద్రుని కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పవిత్ర గోదావరి నది మధ్యలో ప్రకృతి అందాల నడుమ 600 ఏళ్లకు పైబడిన కాకతీయుల కాలం నాటి నుంచి విశిష్ఠ చరిత్ర కలిగిన మోతెగడ్డ వీరభద్రుని కల్యాణానికి సర్వం సిద్ధమైంది. ఈ ప్రాంత ప్రజల కోరిన కోర్కెలు తీర్చేదైవంగా గిరిజనుల ఆరాధ్య దైవంగా స్వామివారిని కొలుస్తారు. జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా శివరాత్రి పర్వదినాన స్వామివారి కల్యాణము వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తారు.

దేవాలయం విశిష్ఠత..

కాకతీయుల కాలం నాటి ఈ పురాతన శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయానికి శ్రీసూర్యభగవానుడు క్షేత్ర పాలకుడిగా ఉండటం విశేషం. సంతానం లేనివారు పవిత్ర గోదావరి నదిలో మూడు సార్లు స్నానం చేసి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి ప్రాణాసారం పట్టడం ద్వారా సంతానం కల్గుతుందని ఇక్కడి ప్రజల నమ్మకం. కార్తీకమాసంలో నోములకు, శివరాత్రి పర్వదినాన స్వామి కల్యాణానికి అవసరమైన తలంబ్రాల బియ్యంను భక్తులు స్వయంగా వడ్లు వలిచి తయారుచేస్తారు. కల్యాణానికి ముందు రోజున స్వామి వారు చింతలగూడెం నుంచి వీరభద్రుని గుట్టకు చేరుకుంటారు. శివరాత్రి రోజు తెల్లవారుజామున స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, సర్వ దర్శనం, విశేష అర్చనలు జరిపి, లింగోద్భవ కాలములో స్వామి వారి కల్యాణం వైభవంగా జరిపిస్తారు. మరుసటి రోజు అత్యంత పవిత్రమైన శ్రీరుద్ర గాయత్రి మహాయజ్ఞం వైభవోపేతంగా జరుగుతుంది. స్వామివారి కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తుంది.

ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీఓ..



మోతెగడ్డ జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ రత్నకల్యాణి

మోతెగడ్డ జాతర ఏర్పాట్లను భద్రాచలం ఆర్డీఓ రత్న కల్యాణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులకు సూచించారు. గోదావరి నదిలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, దేవాదాయ, ఇరిగేషన్, వైద్యారోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ముందస్తు జాగ్రత్తగా.. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భగవాన్రెడ్డి, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, సర్పంచ్లు పోతునూరి సూరమ్మ, కొర్సా లక్ష్మి, మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామయ్య చెంత విధులు..
ఆనందం, అదృష్టం



శివాజీ దంపతులను సత్కరిస్తున్న అర్చకులు, తదితరులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీరామచంద్ర స్వామి సన్నిధిలో విధులు నిర్వర్తించడం ఆనందమే కాక అదృష్టం కూడా అని బదిలీపై వెళ్తున్న ఈఓ బి.శివాజీ వెల్లడించారు. శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఈఓగా పనిచేసి బదిలీపై రెవెన్యూ శాఖకు వెళ్తున్న శివాజీ దంపతులను శుక్రవారం స్థానిక జీయర్ మఠంలో ఘనంగా సత్కరించారు. జీయర్ మఠం, వికాస తరంగిణి అధ్యక్షులు వెంకటాచారి, కమల రాజశేఖర్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ వివాదరహితుడిగా, సౌమ్యుడిగా రామయ్యతో పాటుగా సామాన్య భక్తులకు శివాజీ సేవలను అందించారని కొనియాడారు. మూడేళ్ల పాటు అనేక ఉత్సవాలను విజయవంతం చేయాలని గుర్తు చేశారు. అనంతరం శివాజీ మాట్లాడుతూ రామయ్య చెంతన పనిచేయడం తన అదృష్టమని, ఈ అవకాశం ఇచ్చిన అధికారులు, సహకరించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఉద్యోగులు, వివిధ సంస్థల బాధ్యులు డాక్టర్ ఎస్.ఎల్.కాంతారావు, పాకాల దుర్గాప్రసాద్, గాది మాధవరెడ్డి, తిప్పన సిద్ధులు, యోగి సూర్యనారాయణ, పల్లటి దేశప్ప, పరిమి సోమశేఖర్, నర్సింహారావు, హరిశ్చంద్రనాయక్, వసంతరావు, నాగేశ్వరరావు, చారుగుల్ల శ్రీనివాస్, మురళీకృష్ణమాచార్యులు, సీతారామానుజాచార్యులు, రవీంద్ర, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

- తీరనున్న గిరిజనుల కష్టాలు
- ఈ నెల 21న శంకుస్థాపన చేయనున్న ప్రభుత్వ విప్ రేగా

అశ్వాపురం: ఎన్నో ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్న గిరిజనుల రహదారి కష్టాలు తీరనున్నాయి. మండలంలోని మారుమూల గ్రామాలైన మనుబోతులగూడెం, వేములూరు, సర్వాయిపాడుబంజర గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యమే లేదు. అంతేకాక సంద్రలబోడు, ఇరవెండి కొత్తూరు, రామచంద్రాపురం గ్రామాలకు రహదారి సక్రమంగా లేకపోవడంతో రహదారుల కష్టాలు తీరనున్నాయి. అశ్వాపురం రైల్వేస్టేషన్కు రహదారి సౌకర్యం లేక భారజల కర్మాగార అధికారులు, ఉద్యోగులు, మండల ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు చొరవతో రహదారి నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. కాగా, ఈ నెల 21న ఎమ్మెల్యే రేగా ఆయా రహదారులకు శంకుస్థాపన చేయనున్నారు.

కేటాయింపు వివరాలిలా..

రామచంద్రాపురం నుంచి ఇరవెండి వయా పైకొత్తూరు రహదారికి రూ.2 కోట్లు, గొల్లగూడెం నుంచి సర్వాయిపాడుబంజర రహదారికి రూ.1.40 కోట్లు, సంద్రలబోడు నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు రహదారికి రూ.కోటి, తురుములగూడెం నుంచి గొందిగూడెం వయా రైల్వేస్టేషన్ రహదారికి రూ.2 కోట్లు, గొందిగూడెం నుంచి మనుబోతులగూడెం వరకు రహదారికి రూ.2 కోట్లు, ఎలకలగూడెం నుంచి మనుబోతులగూడెం రహదారికి రూ.6.67 కోట్లతో రహదారులకు నిధులు మంజూరయ్యాయి.

'పది'లో నూరుశాతం ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్

పాల్వంచ: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ఎస్ఎస్ ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కేటీపీఎస్ ఉన్నత పాఠశాల, పునుకుల ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఒక నిర్దేశిత ప్రణాళికను ఏర్పాటు చేసుకొని చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పక్కా కార్యచరణతో ముందుకు సాగాలని, నాణ్యమైన అల్పాహారం ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి ఎస్కె.సైదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు మల్లేశ్, విజయలక్ష్మి

ఇల్లెందురూరల్: సమగ్ర సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం అశ్వారావుపేట పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ మల్లేశ్ సూచించారు. మండలంలోని కొమరారం రైతు వేదికలో పురుగుమందు రహిత పండు ఈగ, చీడపీడల నివారణపై రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. చీడపీడల నివారణకు పురుగు మందులు వాడటం వల్ల పెట్టుబడి పెరుగుతుందని, ప్రత్యామ్నాయ పద్ధతులను పాటిస్తే ఆర్థిక భారం తగ్గడంతో పాటు నాణ్యమైన దిగుబడులు వస్తాయని చెప్పారు. సోలార్ లైట్ట్రాప్, లింగాకార బుట్టలు వంటి వాటిని రైతులకు పరిచయం చేసి వాటిని వినియోగించుకోవాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించి పలువురు రైతులకు ఆయా బుట్టలను పంపిణీ చేశారు. అనంతరం క్షేత్రపర్యటన చేసి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి జినుగు మరియన్న, ఏడీఏ వాసవీరాణి, ఏఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో 2015లో జరిగిన హత్య కేసుకు సంబంధించి నలుగురికి జీవితఖైదు శిక్షను విధిస్తూ భద్రాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ తీర్పు చెప్పారు. ఈమేరకు శుక్రవారం వెలువడిన తీర్పు వివరాలిలా ఉన్నాయి. పాల్వంచకు చెందిన మల్లెల రవిచంద్ర, ఆయన సోదరుడు నాగేశ్వరావు శాటిలైట్స్ నెట్వర్క్ వ్యాపారం చేస్తున్నారు. ఈక్రమంలో పాల్వంచకు చెందిన డిజిటల్ ఆపరేటర్లు గుర్రపాటి రమేష్, బుడిడం రవి, రమణమూర్తి నాయుడు, శివరామకృష్ణతో గొడవలు జరుగుతున్నాయి. దీంతో 2015 డిసెంబర్ 9న నాగేశ్వరావు, ఆయన వర్కర్లు రవితేజ, మేదరమెట్ల రవి కిన్నెరసాని రోడ్డులో కేబుల్ లైన్ వేస్తుండగా, పాల్వంచ మండలం కర్కవాగుకు చెందిన ఉండేటి ఏసుపాదం, జాల శ్రీనివాసరావు, శివరామకృష్ణ, వై.రమణమూర్తి నాయుడు, రాఘవ, బుడిగం రవి, గొర్రపాటి రమేష్ వచ్చిగొడవపడ్డారు. తమ ప్రాంతంలో లైన్ వేయడం ఏమిటని గొడవకు దిగడమే కాక నాగేశ్వరావుపై ఏసుపాదం కత్తితో నరకగా పారిపోయారు. ఆతర్వాత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నాగేశ్వరరావు మృతి చెందగా, హత్యకు పురిగొల్పిన విజయవాడ సిటీ కేబుల్కు చెందిన దండమూరి కృష్ణమోహన్, సంస్థ బాధ్యులు, ఇతరులపై అప్పటి పాల్వంచ సీఐ ఎం.ఏ.షుకూర్, టౌన్ ఎస్సై పి.సత్యనారాయణరెడ్డి కేసు నమోదు చేశారు.

17 మందిపై చార్జిషీట్..

దర్యాప్తు అనంతరం కోర్టులో 17 మందిపై చార్జిషీట్ దాఖలు చేయగా సాక్షులను విచారించిన కోర్టు ఏసుపాదం, దాసరి శ్రీను, శాంతకుమార్, జాల శ్రీనివాసరావును దోషులుగా గుర్తించి జీవిత ఖైదు విధించింది. మిగతా వారిపై ఆధారాలు లేకపోవడంతో నిర్దోషులుగా జడ్జి తీర్పును చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ పోసాని రాధాకృష్ణమూర్తి వాదించగా, ఉద్యోగులు ఎన్.వీరబాబు, హరిగోపాల్, ఎం.వెంకయ్య సహకరించారు. కాగా, హత్య కేసులో నిందితులకు శిక్ష పడేలా ఆధారాలు సేకరించిన, వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.రాధాకృష్ణమూర్తి, సీఐ నాగరాజు, ఎస్సైలు నరేష్, ప్రవీణ్, కానిస్టేబుల్ వెంకయ్యను ఎస్పీ డాక్టర్ వినీత్ అభినందించారు.

దళ కమాండర్ను కోర్టులో హాజరుపర్చాలి

చర్ల: పార్టీ వ్యవహారాలపై బయటకు వెళ్లిన మావోయిస్టు శబరి దళ కమాండర్ సందీప్ను మంగళవారం అదుపులోకి తీసుకున్న పోలీసులు వెంటనే కోర్టులో హాజరుపర్చాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం అల్లూరి సీతారామ రాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ హెచ్చరించారు. ఈమేరకు శుక్రవారం ఆయన పేరిట ఓ లేఖ విడుదల చేశారు. ద్రోహులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు మంగళవారం శబరి దళ కమాండర్ సందీప్ను అదుపులోకి తీసుకున్నా..ఇప్పటికే ప్రకటన చేయకపోవడం గర్హనీయమని తెలిపారు. ఇకనైనా ఆయనకు హాని తలపెట్టకుండా కోర్టులో హాజరుపర్చకపోతే బాధ్యులు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆజాద్ హెచ్చరించారు.

వేర్వేరు చోట్ల 480 కేజీల గంజాయి స్వాధీనం

ఆళ్లపల్లిలో 300 కేజీలు, భద్రాచలంలో 180 కేజీలు పట్టివేత



వివరాలను వెల్లడిస్తున్న ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి, పోలీసు అధికారులు



పట్టుబడిన గంజాయి, నిందితుడితో ఎన్ఫోర్స్మెంట్ అధికారులు

గుండాల: పాల్వంచ పోలీసుల నుంచి తప్పించుకుని బంగారుచెలక, చింతకుంట మీదుగా కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఆళ్లపల్లి పోలీసులు పట్టుకున్నారు. కారుతో పాటు 300 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకోగా మరొకరు పరారీలో ఉన్నారు. ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్కు చెందిన నేనావత్ భరత్, నల్గొండకు చెందిన నూనావత్ సుమన్ మహేంద్ర మారోజ్(టీఎస్22డీఆర్ 5993) కారులో ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్కు గంజాయి అక్రమంగా తరలిస్తున్నారు. రెండు వాహనాల్లో తరలిస్తున్న గంజాయిని భద్రాచలం బ్రిడ్జి వద్ద పోలీసులకు ఓ కారు పట్టుపడింది. రెండో కారు తప్పించుకుని పాల్వంచ మండలం బంగారు చెలక, చింతకుంట, ఆళ్లపల్లి మీదుగా వెళ్తోంది. పాల్వంచ పోలీసులు ఇచ్చిన సమాచారంతో ఆళ్లపల్లి ఎస్సై రతీష్ ఆధ్వర్యంలో ఆళ్లపల్లి గ్రామ సమీపంలో అడ్డగించి పట్టుకున్నారు. ఈక్రమంలో నిందితులు పరారవుతుండగా.. వెంటాడడంతో భరత్ పట్టుబడ్డారు. ఇక మరొకరైన సుమన్ పరారిలో ఉండగా పోలీసులు గాలింపు చేపట్టారు. ఈక్రమంలో కారుతో పాటు రూ. 60 లక్షల విలువ చేసే 300 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పట్టుబడిన వ్యక్తిని విచారించగా గంజాయిని హైదరాబాద్కు తరలిస్తున్నట్లుగా ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. ఈసమావేశంలో టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు రతీష్, అరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలంలో 180 కేజీలు..

భద్రాచలంఅర్బన్: అక్రమంగా తరలిస్తున్న 180 కేజీల గంజాయిని శుక్రవారం ఎన్ఫోర్స్మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్కు చెందిన ఓ వ్యక్తి ఒడిశా నుంచి తెలంగాణలోని భద్రాచలం మీదుగా మహారాష్ట్రకు కారులో గంజాయిని తరలిస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం భద్రాచలం చెక్పోస్ట్ వద్ద కారు ఆపి తనిఖీ చేయగా.. 80 ప్యాకెట్లలో సుమారు 180 కేజీల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పట్టుబడిన వ్యక్తిని ఆరా తీయగా ఇది ఒడిశాలో రూ.3 లక్షలకు కొనుగోలు చేసి మహారాష్ట్రలో రూ.36 లక్షలకు అమ్ముకునేందుకు వెళ్తున్నట్లు తెలిపాడు. దీంతో కారును సీజ్ చేసి గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎన్ఫోర్స్మెంట్ అధికారి తెలిపారు.

గంజాయి పట్టివేత..?

పాల్వంచ: బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. శుక్రవారం బొలేరో వాహనంలో చింతూరు నుంచి హైదరాబాద్కు గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీస్ టాస్క్ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టి పాల్వంచ పరిధిలో పట్టుకున్నట్లు తెలిసింది. ఈక్రమంలో వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు సుమారు 50 నుంచి 60 కేజీల వరకు గంజాయితో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు రహస్యంగా విచారణ చేపట్టినట్లు సమాచారం. కాగా, ఈ విషయమై సీఐ నాగరాజును 'సాక్షి' వివరణ కోరగా.. వివరాలు తమ దృష్టికి రాలేదని వెల్లడించారు.

యువతి అదృశ్యం

ములకలపల్లి : మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు స్థానిక పోలీస్స్టేషన్లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తూరు గ్రామానికి చెందిన వాడే బాబూరావు, లక్ష్మి దంపతులు ఈనెల 14వ తేదీన పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. ఈ క్రమంలో భద్రాచలంలో నర్సింగ్ చేస్తున్న వారి కుమార్తె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం యువతి తల్లిదండ్రులు ఇంటికి తిరిగి రాగా కూతురు కనిపించలేదు. దీంతో ఎక్కడ వెతికినా జాడ తెలియకపోవడంతో యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

గడ్డివాము దగ్ధం

దుమ్ముగూడెం: సీతారాంపురానికి చెందిన మోతుకూరి వెంకటాద్రికి చెందిన గడ్డివాము శుక్రవారం దగ్ధమైంది. సమీపంలో రేకులషెడ్డు నిర్మాణం కోసం వెల్డింగ్ పనులు చేస్తుండగా నిప్పురవ్వలు ఎగిరిపడి గడ్డివాము దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. స్థానికుల సమాచారంతో ఫైరింజన్తో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

రైతులకు ధాన్యం వ్యాపారి టోకరా

- రూ.2 కోట్లు ఎగవేత?
- మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లో బాధితులు
- పోలీసుస్టేషన్లలో రైతుల ఫిర్యాదు

బెల్లంపల్లి/తాండూర్/రెబ్బెన(ఆసిఫాబాద్): ధాన్యం విక్రయించిన రైతులను ఓ వ్యాపారి నిలువునా ముంచాడు. మద్దతు ధరతో వరి ధాన్యం కొనుగోలు చేసి నెలలు గడిచినా డబ్బులు ఇవ్వకుండా అదృశ్యమయ్యాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లో బాధిత రైతులు శుక్రవారం పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశారు. వ్యాపారి నల్ల రమేష్ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, తాండూర్, కుమురంభీం జిల్లా రెబ్బెన మండలాల్లోని గ్రామాల్లో వంద మందికిపైగా రైతుల వద్ద ఖరీఫ్‌లో సుమారు రూ.2 కోట్లకుపైగా విలువైన వరి ధాన్యం కొనుగోలు చేశాడు. సీజన్ ప్రారంభంలో ధాన్యం విక్రయించిన రైతులకు మద్దతు ధర చెల్లించాడు. దీంతో మిగతా రైతులకు అతడిపై నమ్మకం ఏర్పడటంతో ధాన్యం విక్రయించారు. డబ్బులు కొద్ది రోజుల్లోనే చెల్లిస్తానంటూ గడువు విధిస్తూ వచ్చాడు. అయితే నెలలు గడిచినా డబ్బులు చెల్లించకపోవడం, కొంతకాలంగా రమేష్ మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ రావడం, అందుబాటులో లేకపోవడంతో రైతుల్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఒక్క రెబ్బెన మండలంలోని కిష్టాపూర్‌లో ఆరుగురు, రాజారాంలో నలుగురు, తక్కళ్లపల్లిలో సుమారు 17మంది రైతులు రెండు వేల క్వింటాళ్ల వరకు ధాన్యం విక్రయించారు. ఈ మండలంలో సుమారు రూ.30లక్షల వరకు చెల్లించాల్సి ఉండగా, మంచిర్యాల జిల్లా వెంకటాపూర్‌లో రూ.20 లక్షలు, రేచినిలో రూ.10 లక్షలు, మిగతా గ్రామాల్లో రూ.40 లక్షలు చెల్లించాల్సి ఉన్నట్లు బాధిత రైతుల ద్వారా తెలుస్తోంది. మోసపోయామని గ్రహించిన రైతులు మంచిర్యాల జిల్లా తాండూర్ సీఐ జగదీష్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. రెబ్బెన, కన్నెపల్లి పోలీస్‌స్టేషన్లలోనూ ఫిర్యాదు చేశారు.

కల్తీ విత్తన విక్రేతలపై కఠిన చర్యలు: డీజీపీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నాసిరకం విత్తనాలు విక్రయిస్తున్న ముఠాలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు డీజీపీ అంజనీకుమార్ వెల్లడించారు. 2014 నుంచి 2022 వరకు మొత్తం 991 కేసులు నమోదు చేసినట్లు శుక్రవారం డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నాసిరకం విత్తనాల విక్రయానికి యత్నించిన 1,932 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 58 మందిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వరి సాగు ఖర్చు రూ. 1,360... మద్దతు ధర రూ. 2,060

ఖర్చుకు తగినట్లు మద్దతు ధరలు

- కేంద్ర వ్యవసాయ శాఖ తాజా నివేదిక వెల్లడి
- పత్తి ఖర్చు రూ. 4,050... మద్దతు ధర రూ. 6,080
- రైతులకు 50 శాతం ఆదాయం వస్తుందన్న కేంద్రం... 23 రకాల పంటలపై కేంద్ర ప్రభుత్వ విశ్లేషణ
- ఆ ధరలు సరిపోవంటున్న రాష్ట్ర ప్రభుత్వం... రైతులకు మద్దతు ధర పెంచాలని స్పష్టీకరణ
- స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం వరికి మద్దతు ధర రూ. 2,499 ఇవ్వాలని డిమాండ్
- పత్తికి రూ. 8,574, మొక్క జొన్నకి రూ.3,199 ఇవ్వాలంటున్న తెలంగాణ సర్కారు



సాక్షి, హైదరాబాద్: దేశంలో సాగు ఖర్చుకు మించి మద్దతు ధరలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 23 రకాల పంటల సాగుకు అయ్యే ఖర్చు ఎంత? వాటికి అందుతున్న మద్దతు ధర ఎంత అనే దానిపై తాజాగా ఒక అధ్యయన నివేదిక విడుదల చేసింది. వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్ (సీఏసీపీ) మేరకు సాగు ఖర్చులను దేశ వ్యాప్తంగా లెక్కలోకి తీసుకొని వీటి సరాసరిన నివేదికలో పొందుపరిచింది. 2022–23లో వరి ఉత్పత్తి ఖర్చు క్వింటాల్‌కు రూ. 1,360 ఉండగా, కనీస మద్దతు ధర రూ. 2,060గా కేంద్రం నిర్ధారించిన సంగతి తెలిసిందే. పత్తి ఉత్పత్తి ఖర్చు రూ. 4,053 ఉండగా, దాని మద్దతు ధర రూ. 6,080గా ఉంది. అలాగే మొక్కజొన్న సాగు, ఉత్పత్తి ఖర్చు రూ. 1,308 ఉండగా, దాని మద్దతు ధర రూ. 1,962గా ఉంది. కంది ఉత్పత్తి ఖర్చు రూ. 4,131 కాగా, మద్దతు ధర రూ. 6,600 ఉంది. ఇక సోయాబీన్ ఉత్పత్తి ఖర్చు ధర రూ. 2,805 కాగా, మద్దతు ధర రూ. 4,300 ఉంది. వేరుశనగ సాగు ఖర్చు రూ. 3,873 కాగా, 5,850గా ఉంది. ఉత్పత్తి వ్యయంపై కనీసం 50 శాతం లాభం కలిగించేలా కనీస మద్దతు ధరలు నిర్ధారించినట్లు కేంద్రం తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. ఇలా మూడేళ్ల సాగు ఖర్చు, వాటికిచ్చిన మద్దతు ధరల వివరాలను పొందుపరిచింది.

కేంద్రం వర్సెస్ రాష్ట్రం...

అయితే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సాగు ఖర్చు వివరాలు, మద్దతు ధరలు శాస్త్రీయంగా లేవని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్‌కు పలుమార్లు రాష్ట్రంలోని పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం విన్నవించింది. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధరలు ఉండాలని కేంద్రాన్ని కోరింది. సాగు ఖర్చుకు మరో 50 శాతం అదనంగా కలిపి ఎంఎస్‌పీ ఇవ్వాలని సీఏసీపీకి ప్రతిపాదించింది. అందులో వివిధ పంటలకు ఎంతెంత ఖర్చు అవుతుందో వివరించింది. పంటల వారీగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పంటకోత, రవాణా, కూలీ, రైతు కుటుంబ శ్రమకు ప్రతిఫలం అన్నీ కలిపి ఎంత ఖర్చు అవుతుందో సవివరంగా కేంద్రానికి నివేదించింది. ఒక వ్యాపారి తన వస్తువును అమ్ముకునేప్పుడు ధర ఎలా నిర్ణయిస్తారో, ఆ ప్రకారమే పెట్టిన పెట్టుబడి, దానికి అయ్యే వడ్డీలను లెక్కలోకి తీసుకొని సాగు ఖర్చును నిర్ధారించారు. ప్రతీ ఏడాది ఇలాగే శాస్త్రీయంగా సాగు ఖర్చు, ఎంఎస్‌పీ ఎలా ఉండాలో తెలంగాణ వ్యవసాయశాఖ ఇస్తూనే ఉంది. కానీ కేంద్రం తన పద్ధతిలో తాను ఎంఎస్‌పీని నిర్ధారిస్తూ పోతోందని వ్యవసాయ అధికారులు అంటున్నారు.

సాగు ఖర్చు నిర్ధారణలో శాస్త్రీయత లేదు



సాగు ఖర్చును అంచనా వేయడంలో కేంద్రానికి శాస్త్రీయమైన పద్ధతి లేదు. దేశంలో జిల్లాకో రకంగా సాగు ఖర్చు ఉంటుంది. దీంతో ఒకచోట ఎక్కువ ఒకచోట తక్కువగా ఉంటుంది. కాబట్టి ప్రస్తుతం వేసిన సాగు ఖర్చు, దాని ప్రకారం మద్దతు ధర నిర్ధారణ సరిగా లేదు. దీంతో రాష్ట్రంలో ఉన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీఏసీపీకి పంపే నివేదికలకు ఏమాత్రం విలువ ఉండటం లేదు.

– డి.నర్సింహారెడ్డి, జాతీయ వ్యవసాయ నిపుణులు

వరి సాగు ఖర్చు ఎకరానికి రూ. 40 వేలు...

సాధారణ వరి రకం పండించేందుకు నారుమడి సిద్ధం చేయడం మొదలు విత్తనాలు, నాట్లు, ఎరువులు, కలుపుతీత, చివరకు పంట కోత, కూలీల ఖర్చు, కుటుంబ సభ్యుల శ్రమ మొత్తం కలుపుకుంటే ఎకరానికి రూ. 40 వేలు ఖర్చు (24 క్వింటాళ్లు) అవుతున్నట్లు లెక్కగట్టింది. ఆ ప్రకారమే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఖరారు చేసింది. ఎకరా ఖర్చు ప్రకారం క్వింటా వరి పండించాలంటే రూ. 1,666 ఖర్చు అవుతుందని నిర్ధారణ చేసింది. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం సాగు ఖర్చుకు 50 శాతం అదనంగా కలిపి ఎంఎస్‌పీ రూ. 2,499 ఇవ్వాలని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వరి ఎంఎస్‌పీ రూ. 2,060గా ఉండగా, అధికంగా పెంచాలని కోరుతున్నారు. అలాగే రాష్ట్రంలో అత్యధికంగా సాగు చేసే పత్తికి కూడా ఎకరాకు రూ.40 వేలు ఖర్చు కానుంది. అయితే ఎకరాకు పత్తి ఏడు క్వింటాళ్లు పండుతాయి. కాబట్టి క్వింటాకు రూ. 5,714 ఖర్చు కానుంది. ఆ లెక్కన స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం రూ. 8,574 పెంచాలని వ్యవసాయశాఖ వర్గాలు అంటున్నాయి. ప్రస్తుతం పత్తి మద్దతు ధర రూ. 6,080 మాత్రమే ఉండగా, మరో రూ. 2,491 వరకు పెంచాల్సి ఉంటుంది. జిల్లా.. జిల్లాకు సాగు ఖర్చులో తేడా ఉంటున్నందున దేశీయంగా ఒకేవిధమైన ఉత్పత్తి ఖర్చు అంచనా వేయలేమని, సరాసరిని లెక్కలోకి తీసుకోవడం తగదని పలువురు అంటున్నారు. మొక్కజొన్నకు ఎకరానికి రూ. 32 వేల వరకు ఖర్చుకానుంది. ఎకరానికి 15 క్వింటాళ్లు పండిస్తారు. అంటే క్వింటాకు రూ. 2,133 ఖర్చు కానుంది. ఆ ప్రకారం మద్దతు ధర రూ. 3,199 ఇవ్వాలని అంటున్నారు. కందికి రూ. 21 వేల వరకు ఖర్చుకానుంది. ఎకరానికి 4 క్వింటాళ్లు పండుతుంది. అంటే క్వింటాలుకు రూ. 5,250 ఖర్చు వస్తుంది. ఆ ప్రకారం మద్దతు ధర రూ. 7,875 పెంచాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం దీనికి రూ. 6,600 మద్దతు ధర ఉంది. సోయాబీన్‌కు రూ. 32 వేల వరకు ఖర్చు అవుతుంది. ఎకరానికి 5 క్వింటాళ్లు పండుతుంది. దీనికి క్వింటాలుకు రూ.6,400 ఖర్చు కానుంది. ఆ ప్రకారం మద్దతు ధర రూ. 9,600 చేయాల్సి ఉంటుందని అంటున్నారు.

ఇంటరాగేషన్‌లో గాయాలు.. వ్యక్తి మృతి!

- మెదక్ పట్టణంలో చైన్ స్నాచింగ్
- అనుమానంతో ఖదీర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విడిచిపెట్టాక అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిక.. చికిత్స పొందుతూ మృతి



ఖదీర్ భార్య, పిల్లలు.



చికిత్స పొందుతూ గాంధీలో మృతి చెందిన ఖదీర్

మెదక్ జోన్: చైన్ స్నాచింగ్ చేశాడనే అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యక్తి.. తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి, చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు చిత్రహింసలు పెట్టి, ఇష్టం వచ్చినట్టుగా కొట్టారని.. దానితో కిడ్నీలు దెబ్బతిని మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెదక్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి మృతుడి భార్య ఎస్పీకి ఫిర్యాదు చేసింది. భర్త చావుకు కారణమైన పోలీసులపై హత్యకేసు పెట్టి, అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది.

అసలు ఏం జరిగింది?

మెదక్ పట్టణంలోని అరబ్ గల్లీలో జనవరి 27న గుర్తు తెలియని దుండగుడు ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు తెంపుకెళ్లాడు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు.. ఆ దుండగుడు మహ్మద్ ఖదీర్ అని అనుమానించారు. మెదక్ పట్టణంలో చిన్న పాన్ షాపు నడుపుకొనే ఖదీర్.. అది సరిగా నడవకపోవడంతో కొన్నిరోజులుగా హైదరాబాద్‌లోని తన సోదరి ఇంట్లో ఉంటూ కూలిపనులు చేసుకుంటున్నాడు. అతడి గురించి ఆరా తీసిన పోలీసులు జనవరి 29న హైదరాబాద్ వెళ్లి, సోదరి ఇంట్లో ఖదీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మెదక్ ఠాణాకు తరలించి ఐదు రోజులపాటు అదుపులో ఉంచుకున్నారు. ఏమీ తేలకపోవడంతో ఫిబ్రవరి 3న మెదక్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి వదిలేశారు.

దెబ్బలకు కిడ్నీలు దెబ్బతిని..

పోలీసులు వదిలేసిన తర్వాత ఖదీర్ తీవ్రంగా అస్వస్థతకు లోనయ్యాడు. ఫిబ్రవరి 6న మెదక్ ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. పరీక్షలు చేసిన వైద్యులు బలమైన దెబ్బలు తగిలి కిడ్నీలు చెడిపోయాయని, మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. దీనితో ఖదీర్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, మూడు రోజులు చికిత్స చేయించారు. ఈ ఖర్చులను పోలీసులే భరించారని ఖదీర్ భార్య తెలిపింది. కానీ ఖదీర్ పరిస్థితి విషమించడంతో ఫిబ్రవరి 12న గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ 16న రాత్రి మృతి చెందాడు. గురువారం రాత్రే ఖదీర్ చనిపోయినా.. కేసు నమోదవకపోవడం, ఎఫ్ఐఆర్ కాకపోవడంతో మృతదేహానికి శుక్రవారం రాత్రి వరకు పోస్టుమార్టం చేయలేదు. దీనితో పోలీసులు సీఆర్‌పీసీ సెక్షన్ 174 కింద కేసు నమోదు చేశారు.

ఎస్సై, కానిస్టేబుళ్ల బదిలీ

ఖదీర్ మృతి నేపథ్యంలో మెదక్ పట్టణ ఎస్సై రాజశేఖర్‌ను డీసీఆర్బీకి అటాచ్ చేస్తూ.. కానిస్టేబుల్ పవన్ కుమార్‌ను రేగోడుకు, ప్రశాంత్‌ను పాపన్నపేటకు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

అకారణంగా నా భర్తను చంపేశారు

దొంగతనం నెపంతో తన భర్తను దారుణంగా కొట్టి చావుకు కారణమైన పోలీసులపై హత్యకేసు నమోదు చేయాలని ఖదీర్ భార్య సిద్దేశ్వరి డిమాండ్ చేశారు. దీనిపై శుక్రవారం మెదక్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన భర్తను అకారణంగా చంపి తనను, తన ముగ్గురు పిల్లలను రోడ్డున పడేసిన పోలీసులకు ఉసురు తగులుతుందంటూ ఆమె రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది. కాగా.. హైదరాబాద్‌లోని తమ ఇంట్లో ఖదీర్‌ను అదుపులోకి తీసుకునే సమయంలో పోలీసులు దారుణంగా కొట్టారని, కాళ్లు మొక్కినా వినలేదని ఖదీర్ సోదరి తహసుల్ పేర్కొన్నారు.

పాత నేరస్తుడని అదుపులోకి..

"ఖదీర్ పాత నేరస్తుడు. అరబ్‌గల్లీలో ఓ మహిళ మెడలోంచి గొలుసు తెంపుకెళ్లిన వ్యక్తి సీసీ ఫుటేజీలో ఖదీర్‌లా ఉండటంతోనే అదుపులోకి తీసుకున్నాం. ప్రశ్నించిన తర్వాత ఫిబ్రవరి 3వ తేదీన తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి వదిలేశాం. 6వ తేదీన అతడు ఆస్పత్రిలో చేరాడు. మధ్య ఏం జరిగిందో మాకు తెలియదు.."

– మెదక్ డీఎస్పీ సైదులు

మార్చి 25లోగా ఉపాధి పనుల పూర్తి

పీఆర్‌శాఖ ముఖ్యకార్యదర్శి ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, జీపీ భవనాల పనులను వచ్చేనెల 25 లోగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఆదేశించారు. మంజూరైన ఉపాధి పనులు, గ్రౌండింగ్ పనుల ప్రగతిపై శుక్రవారం బీఆర్‌కేఆర్ భవన్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లోసమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గడువులోగా పనులు పూర్తిచేసి ఎఫ్‌టీపీలో అప్లోడ్ చేస్తే నిధులు వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆయా జిల్లాల్లో అందుబాటులో ఉన్న మెటీరియల్ కాంపోనెంట్ నిధుల ఆధారంగా ప్రాధాన్యం ప్రకారం చేపట్టాలని స్పష్టం చేశారు. పనులను సకాలంలో పూర్తి చేసేందుకు కూలీలను పెద్ద సంఖ్యలో తరలించాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా పక్కాగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు

పెద్దవంగర: సంత్ సేవాలాల్ మహరాజ్ బంజారాల ఆరాధ్యదైవమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరలో శుక్రవారం బీఆర్‌ఎస్ ముఖ్యనాయకులతో ఏర్పాటు చేసిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. సంత్ సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 26న పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఎకరం స్థలంలో సేవాలాల్ భవనం, గుడితో పాటు ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. ఇందులో మహారాష్ట్రకు చెందిన సేవాలాల్ ఆరాధ్య పండితులు పాల్గొననున్నారని చెప్పారు. కాగా, ముఖ్యమంత్రి కేసీఆర్ 3,146 తండాలను గ్రామపంచాయతీలు ఏర్పాటు చేసి గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచారని తెలిపారు. ఈసమావేశంలో సేవాలాల్ జయంతి ఉత్సవాల నియోజకవర్గ కోకన్వీనర్ రవి రాథోడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్యతో పాటు శ్రీరాం సుధీర్, బానోతు రవీందర్, వెంకన్న, పటేల్ నాయక్, పద్మ, రాజేందర్ పాల్గొన్నారు.

బొగ్గు రవాణాలో అంతరాయం ఏర్పడొద్దు



అధికారులతో సమీక్షిస్తున్న జీఎం రమేష్

సత్తుపల్లిరూరల్: బొగ్గు రవాణాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా అధికారులు పర్యవేక్షించాలని సింగరేణి కొత్తగూడెం జనరల్ మేనేజర్ జక్కం రమేష్ ఆదేశించారు. సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీ, సీహెచ్‌పీలను శుక్రవారం ఆయన తనిఖీ చేసి అధికారులు, సీహెచ్‌పీ నిర్వహణ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. అవసరమైన రేక్‌ల కోసం రైల్వే శాఖతో సంప్రదించాలని చెప్పారు. ఈసమావేశంలో సింగరేణి అధికారులు వై.రఘురామిరెడ్డి, నర్సింహారావు, బంగారు శ్రీనివాస్, లక్ష్మణ మూర్తి, వి.కృష్ణయ్య, మధుసూదన్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

మళ్లీ కళకళలాడేలా..!

- అభయారణ్యాల్లో వన్యప్రాణుల సంతతి పెంపుపై దృష్టి
- జూ పార్క్‌ల నుంచి తరలింపునకు అటవీ శాఖ ఏర్పాట్లు
- త్వరలోనే కిన్నెరసాని డీర్ పార్క్ నుంచి 25దుప్పలు..



కిన్నెరసాని డీర్ పార్కులోని చుక్కల దుప్పులు

పాల్వంచ రూరల్: అభయారణ్యాలుగా ఇప్పుడు చెప్పుకునే ప్రాంతాలు గతంలో దట్టమైన అడవులతో కళకళలాడేవి. దీంతో సహజంగానే వన్యప్రాణులు, ఇతర జీవాలతో సమతుల్యత కనిపించేది. రానురాను స్మగ్లర్ల దాడులు, వేటగాళ్ల ఉచ్చులతో అటు అటవీ ప్రాంతం, ఇటు జీవాల సంఖ్య తగ్గుతూ వస్తోంది. కొత్తగూడెం అటవీ సర్కిల్ పరిధిలోని పాకాల, కిన్నెరసాని అభయారణ్యాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొనగా.. వన్యప్రాణులు అక్కడక్కడా కనిపిస్తున్నా పులులు, చిరుతలు వంటివి అసలే కానరాకుండా పోయాయి. ఈ నేపథ్యాన పార్కుల్లో సాకుతున్న వన్యప్రాణులైన జింకలు, దుప్పలు వంటి వాటిని తిరిగి అభయారణ్యాల్లో వదలడం ద్వారా వాటి సంతతి పెంచాలని నిర్ణయించగా.. మరోపక్క పులులు, చిరుతలు వచ్చేందుకు కూడా మార్గం ఏర్పడుతుందనే నిర్ణయానికి అటవీ శాఖ వచ్చింది. ఇప్పటికే వరంగల్‌లోని కాకతీయ జూ పార్క్ నుంచి చుక్కల దుప్పులు, సాంబర్లు(కణుజులు), నెమళ్లను ఇటీవల ఏటూరునాగారం అభయారణ్యంలో వదిలారు. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కిన్నెరసాని డీర్ పార్క్ నుంచి కూడా జీవాలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమతుల్యత లోపించి...

అభయారణ్యాల్లో దట్టమైన చెట్లు, మొక్కలతో పాటు నీటి వనరులు ఉంటే దుప్పులు, జింకలు, నెమళ్లు, మొసళ్లకు రక్షణతో పాటు సంతతి పెరగడానికి దోహదపడుతుంది. ఇదే సమయాన దుప్పులు, జింకల సంతతి పెరుగుతూ ఉంటే పులులు, చిరుతలు కూడా వచ్చివెళ్లడానికి లేదంటే అభయారణ్యంలో స్థిరనివాసం ఏర్పరుచుకునే అవకాశముంటుంది. కానీ అటు అడవులు తగ్గిపోయి, ఇటు వేటగాళ్ల ధాటికి దుప్పులు, జింకల వంటి వన్యప్రాణులు ఊర్లలోకి వస్తున్నాయి. మరోపక్క పులులకు కావాల్సిన ఆహారం దొరకక ఇతర అభయారణ్యాల్లో వెళ్లిపోతున్నాయి. అంతేకాకుండా వన్యప్రాణులను పార్కులు, ఇతర ప్రాంతాల్లో పెంచడం ద్వారా సహజ సిద్ధమైన వాతావరణానికి దూరమై సంతానోత్పత్తి తగ్గిపోతోందని అటవీ అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యాన వీటన్నింటిని మళ్లీ పూర్వ స్థితికి రావాలన్న లక్ష్యంతో అటవీ శాఖ ఉన్నతాధికారులు ఇటీవల సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

ఇలా చేస్తే మేలు

కిన్నెరసాని డీర్ పార్క్ తదితర పార్కుల్లో జింకలు, దుప్పులు, నెమళ్లు, మొసళ్లను సంరక్షిస్తున్నారు. ఈ పార్కులో మొత్తం 135 చుక్కల దుప్పులు(జింకలు) ఉండగా ఇందులో 54 ఆడవి, 81 మగ జింకలు ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అలాగే, ఆరు మూషిక జింకలతో పాటు కొండగొర్రెలు, నెమళ్లు, మొసళ్లు కూడా ఉన్నాయి. అయితే, పార్క్ పరిధి చిన్నగా ఉండడంతో జీవాల సంతతితో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తరచుగా రహదారులపై చేరడం, వాహనాలు ఢీకొని మృతి చెందడం నిత్యకృత్యమైంది. ఇక పులుల ఆనవాళ్లు జిల్లాలో అసలే లేకపోగా.. అప్పుడు చిరుతలు వచ్చివెళ్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పార్కుల్లో మూగజీవాలను అభయారణ్యాలకు తరలించడం ద్వారా కొంత మేరకు సమస్య తగ్గుతుందనే నిర్ణయానికి అధికారులు వచ్చారు. అలాగే, అభయారణ్యాల్లో వన్యప్రాణుల సంతతి పెరగడానికి మార్గం సుగమవుతుందని.. తద్వారా పులులు, చిరుతలు కూడా ఇటు మార్గం పట్టే అవకాశముందని భావిస్తున్నారు. ఈ మేరకు వరంగల్ కాకతీయ జూ పార్క్ నుంచి ఇప్పటికే ఏటూరునాగారం అభయారణ్యానికి వన్యప్రాణులను తరలించినందున కిన్నెరసాని డీర్ పార్క్ నుంచి కూడా తరలింపునకు ఏర్పాట్లుచేస్తున్నారు.

త్వరలోనే జింకలను తరలిస్తాం



వైల్డ్‌లైఫ్ యానంబైల్ రేంజ్ పరిధి కిన్నెరసాని డీర్ పార్కులో మొత్తం 135 చుక్కల దుప్పులు ఉన్నాయి. ఇందులో 25దుప్పులను అభయారణ్యం పరిధిలోని మైదాన ప్రాంతానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. జింకలను ప్రత్యేక బోన్లలో తీసుకెళ్లి వన్యప్రాణుల సంఖ్య తక్కువగా ఉన్న అటవీ ప్రాంతంలో వదిలేస్తాం. ఆతర్వాత వేటగాళ్ల బారిన పడకుండా నిఘా వేస్తాం. ఇక వేసవిలో అభయారణ్యంలోని వన్యప్రాణులు ఇబ్బంది పడకుండా సోలార్ పంప్ సెట్ల ద్వారా నీరు సమకూరుస్తున్నాం.

– కె.దామోదర్‌రెడ్డి, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ, పాల్వంచ

తీర్థాల జాతరకు బస్సులు ప్రారంభం



ఖమ్మం నుంచి తీర్థాల జాతరకు ఏర్పాటుచేసిన బస్సు వద్ద డీఎం శ్రీనివాస్, ఉద్యోగులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం రూరల్ మండలం తీర్థాలలోని సంగమేశ్వర స్వామి సన్నిధిలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే జాతరకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తోంది. ఈమేరకు ఖమ్మం సిటీ బస్టాండ్ వద్ద శుక్రవారం బస్సులను డిపో మేనేజర్ బి.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు. ఆదివారం వరకు ప్రతీ పది నిముషాలకో బస్సు తీర్థాలకు ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో సీఐ రాములు, కంట్రోలర్ రాములు, సిబ్బంది రమేష్, ఎంఆర్‌కే.నాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్నానాల లక్ష్మీపురం, నీలాద్రికి కూడా...

వైరా/సత్తుపల్లి టౌన్ : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం, పెనుబల్లి మండలం నీలాద్రిలో జరగనున్న జాతరకు ఆర్టీసీ బస్సులు నడిపిస్తున్నట్లు మధిర, సత్తుపల్లి డిపో మేనేజర్లు ఎస్.దేవదానం, యు.రాజ్యలక్ష్మి తెలిపారు. స్నానాల లక్ష్మీపురానికి వైరా బస్టాండ్ నుండి ప్రతీ అరగంటకో బస్సు చొప్పున మూడు రోజుల నడిపిస్తామని డీఎం దేవదానం తెలి పారు. పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10గా టికెట్ ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇక సత్తుపల్లి బస్టాండ్ నుంచి నీలాద్రికి ప్రతీ ఐదు నిమిషాలకో బస్సు నడిపిస్తామని, పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30గా చార్జీలు నిర్ణయించినట్లు డీఎం రాజ్యలక్ష్మి తెలిపారు. కాగా, వీ.ఎం.బంజర బస్టాండ్ మీదుగా నడిచే బస్సులను భక్తులు ఆదరించాలని ఆమె కోరారు.

కొత్తగూడెం నుంచి...

చుంచుపల్లి: మహాశివరాత్రి సందర్భంగా శనివారం కొత్తగూడెం నుంచి పలు శైవ క్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ బి.వెంకటేశ్వర రావు తెలిపారు. కొత్తగూడెం నుంచి నీలాద్రి, అన్నపురెడ్డిపల్లి, బెండాలపాడుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు.

మాకు పాఠాలు చెప్పించండి





హైకోర్టు సీజేకు రాసిన పోస్టుకార్డులతో విద్యార్థులు (ఇన్‌సెట్) సీజేకు పంపించిన పోస్టుకార్డులు

హైకోర్టు సీజేకు విద్యార్థుల పోస్టుకార్డులు

మహబూబాబాద్ రూరల్: భాషా పండితులు విధులు బహిష్కరించడంతో తాము ఇబ్బంది పడుతున్నందున.. పాఠాలు బోధించేలా చర్యలు చేపట్టాలని మహబూబాబాద్ జిల్లా అమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కోరారు. ఈమేరకు విద్యార్థులకు శుక్రవారం సీజేకు పోస్టు కార్డులు పంపించారు. భాషా పండితులు ఈనెల 1వ తేదీ నుంచి తెలుగు, హిందీ బోధన నిలిపేయడంతో పరీక్షలు సమీపిస్తున్నందున తాము నష్టపోయే ప్రమాదం ఉందని ఆ కార్డుల్లో పేర్కొన్నారు. ఈమేరకు న్యాయపరమైన చిక్కులు తొలగించాలని తమకు పాఠాలు సాగేలా చూడాలని విన్నవించారు.

ప్రజల గొంతెండుతున్నా స్పందించరా?

సీపీఐ ఆధ్వర్యాన మున్సిపాలిటీ ఎదుట నిరసన

సింగరేణి(కొత్తగూడెం): ప్రజల గొంతెండుతున్నా మున్సిపల్ పాలకవర్గం, అధికారులు స్పందించకపోవడం గర్హనీయమని కొత్తగూడెం మున్సిపాలిటీ సీపీఐ పక్ష నాయకుడు వై.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తగూడెం పట్టణానికి కిన్నెరసాని నీటి సరఫరా పునరుద్ధరించాలనే డిమాండ్‌తో సీపీఐ కౌన్సిలర్లు, నాయకులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ కుండలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కిన్నెరసాని నీటి సరఫరా పథకాన్ని సద్వినియోగం చేసుకోవడంలో అధికారులు, పాలకవర్గం విఫలమయ్యాయని ఆరోపించారు. నెలలో కేవలం నాలుగైదు రోజులే నీరు సరఫరా చేస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇకనైనా కిన్నెరసాని నీటి సరఫరా పునరుద్ధరించాలని, అప్పటి వరకు ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేయకపోతే ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం వినతిపత్రాన్ని కమిషనర్ జి.రఘుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, బోయిన విజయ్‌కుమార్, పి.సత్యనారాయణచారి, నాయకులు మునిగడప వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాస్, నేరెళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ కుండలతో నిరసన తెలిపుతున్న సీపీఐ కౌన్సిలర్లు